నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

అడ్తిదారులను సంప్రదించి మిర్చి తీసుకురావాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి తీసుకువచ్చే రైతులు అడ్తిదారులను సంప్రదించిన తర్వాతే తీసుకురావాలని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18,19,20వ తేదీలలో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన నేపథ్యంలో రైతులు కొన్ని సూచనలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం మిర్చి సరుకులు అధిక మొత్తంలో వస్తున్నందున అడ్తి వారిని సంప్రదించి వారి సూచనల మేరకే మిర్చి రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావాలని, సరుకు తీసుకువచ్చిన రైతులు కచ్చితంగా షెడ్ల కిందనే వేసుకోవాలని తెలిపారు. వాతావరణ లో తేమ ఉంటుందని, తద్వారా మిర్చి నాణ్యత తగ్గి ధరలు తక్కువ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వాతావరణం మేఘావతం అయి ఉండటం వలన మిర్చి రంగు, నాణ్యతలు పూర్తిస్థాయిలో కనిపించకపోవడం వలన కూడా ధరలపై ప్రభావం ఉంటుందన్నారు. కాబట్టి మిర్చి రైతులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శిగా స్వామిదాస్

నవతెలంగాణ-కాశిబుగ్గ



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శిగా నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బొట్ల స్వామిదాస్ నియ మితులయ్యారు. ములుగురోడ్డు సమీపంలోని టీఎన్జీవోఎస్ భవన్‌లో శని వారం జరిగిన ఫెడరేషన్ వరంగల్, హనుమ కొండ జిల్లాల కమిటీ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొక్క దయా సాగర్, జక్కుల విజయ్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాబురావు స్వామిదాసుకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించిన ఫెడరేషన్ రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వరంగల్ హనుమకొండ జిల్లాల అధ్యక్షులు పోడేటి అశోక్, టీవీ రాజు, నాయకులు ఐలయ్య, గోపాల్, రాజేష్, వెంకటేశ్వర్లు, సురేందర్, సాంబయ్య పాల్గొన్నారు.



ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా

ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అన్నారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పర్వతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం చౌటపల్లి సొసైటీ చైర్మన్ గొర్రె దేవేందర్, వైస్ చైర్మన్ మధుసూదన్‌రావుతో పాటు సొసైటీ పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రజా పాలన చేస్తూ నిరంతరం అభివద్ధికి కషి చేస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్‌రావు, డైరెక్టర్లు బిక్షపతి, శ్రీనివాస్, వల్లందాసు రంగయ్య, శ్రీనివాస్, రంగయ్య, అమతరావ్, చాంప్ల నాయక్, సీనియర్ నాయకులు అరవింద్‌రావు, రామారావు, జున్ను కనకయ్య ఓరుగంటి శ్రీనివాస్, నాగార్జున, దేవేందర్, మల్లిఖార్జునస్వామి ఆలయ చైర్మన్ బెల్లం రాధిక రాజు, సీనియర్ నాయకులు చెవులపల్లి చలపతిరావు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి...

మండలంలోని హట్యా తండా గ్రామ పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బాదావత్ నీలమ్మ వెంకట్రామ్ ఆదివారం గ్రామ పార్టీ అధ్యక్షుడు భూక్య లచ్చు నాయక్, గ్రామ యూత్ అధ్యక్షుడు భూక్య అనిల్, బాధవత్ వీరన్న ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ రావు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, ఉమ్మడి చౌటపల్లి గ్రామ అధ్యక్షుడు జనార్దన్,చల్లా వెంకన్న, లచ్చు, అశోక్, శ్రీను, సంతోష్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదుకు అవకాశం
- ఏప్రిల్ 18 నుండి నామినేషన్ల స్వీకరణ
- మే 13 పోలింగ్
- ఎన్నికల అధికారి పి. ప్రావీణ్య
- రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దు : సీపీ



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పార్లమెంటు ఎన్నికల అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఆదివారం ఉదయం వరంగల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పార్ల మెంటు ఎన్నికలను సజావుగా నిర్వహించ డానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని సహకరించాలని కోరారు.

ఏప్రిల్ 18నుండి నామినేషన్ల స్వీకరణ

పార్లమెంటు ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందన్నారు. ఏప్రిల్ 18నుండి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.

మే 13న పోలింగ్

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికలకు మే 13న పోలింగ్ జరుగనుందని ప్రావీణ్య తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వుంటుందన్నారు.

18.16 లక్షల ఓటర్లు

వరంగల్ పార్లమెంటు (ఎస్సీ) నియోజక వర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజక వర్గాలుండగా, ఇందులో 18లక్షల 16 వేల 543 మంది ఓటర్లు న్నారన్నారు. 977మంది సర్వీస్ ఓటర్లు న్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను సరిచూసుకోవాలన్నారు. జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశముందన్నారు.

రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదు..

ఎన్నికల కోడ్ అమలులో వున్నందునా రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా స్థలాల్లో పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వ హించొద్దన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరి ష్కరించేందుకు ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసిఎంసి కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ 0870 2530811 కాల్ సెంటర్ నెంబర్ ద్వారా సి విజల్ యాప్ ద్వారా చేయవచ్చున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపు

రాజకీయ పార్టీలకు సంబంధించి వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు, పెట్రోల్ బంకులు మొదలైన పబ్లిక్ ప్లేస్‌లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేటు స్థలాల్లో 72 గంటల వ్యవధిలో పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు.

రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దు : పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ఎన్నికల కోడ్ అమలులో వున్నందునా రూ.50 వేలకు మించిన నగదుతో ప్రయా ణించొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రతిరోజూ తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగి స్తామన్నారు. ఆధారాలు చూపించి కమిటీ నుండి నగదును విడుదల చేయించుకోవాలని సూచించారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరుగకుండా అవసరమైన ప్రాంతాల్లో, సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలపాటు గట్టి నిఘాను విధించామన్నారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్ఓ శ్రీనివాస్, ఆర్‌డిఓలు సిద్ధం దత్తు, కృష్ణవేణి, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన 'అరూరి'

వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా ఖరారు..?

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరారు. ఆదివారం హైద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పు కున్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన 'అరూరి' ప్రచారం జరిగిన ట్టుగానే బీజేపీలో చేరడంతో బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగిలి నట్టయ్యింది. ఈ చేరిక కార్యక్రమంలో ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు తదితరులు పాల్గొన్నారు. వరంగల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని ప్రకటించాక ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం కావడం ప్రారంభమైంది. తొలుత పార్టీ టికెట్ ఆశించిన 'అరూరి' బీజేపీలోకి వెళ్లడానికి సన్నద్ధమవడం, ఆయన్ను పిలిచి మాట్లాడాక చల్లబడ్డట్టు కనిపించినా, అనంతరం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో ఢిల్లీకి వెళ్లడం, పార్టీ శ్రేణులను కలవరపరిచింది. ఇలావుండగానే ఎవ్వరూ ఊహించని విధంగా సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ బీఆర్ఎస్‌ను వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ శ్రేణులను అయోమయంలో పడేసింది. త్వరత్వరగా సిట్టింగ్ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు పార్టీ మారుతుండడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇదిలావుండగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో పార్టీలో స్తబ్ధత నెలకొంది. ఏదేమైనా బీఆర్ఎస్ పార్టీ ఇంత త్వరగా బలహీనపడుతుందని భావించలేదని పార్టీ సీనియర్లు వాపోతున్నారు.

వరంగల్ పార్లమెంటు బిజెపి అభ్యర్థిగా 'అరూరి'..?

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఖరారు చేసే అవకాశముందని ఆ పార్టీలో చర్చ జరుగుతుంది. కొన్ని రోజుల క్రితం బిఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీలో చేరిన మూడ్రోజులకే ఆయన్ను మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలో వరంగల్ పార్లమెంటుకు 'అరూరి' అభ్యర్థిత్వం ఖాయమని ఆ పార్టీ వర్గాలే చెబుతుండడం గమనార్హం.

నిధులున్నా.. నిర్మాణం సున్నా

అందని ద్రాక్షలా ఆరోగ్య ఉప కేంద్రాలు
భవన నిర్మాణల కోసం కాంట్రాక్టర్ల విముఖత
పీడీఎంఓలపై అద్దెభారం
అసౌకర్యాల నడుమ గర్భిణులు, ఆశ, ఏఎన్ఎంలు



నవతెలంగాణ-గీసుగొండ

మండలంలోని నందానాయక్‌తండా, మనుగొండ గొర్రెకుంటలో ఆరోగ్య ఉప కేంద్రాలు లేక గర్భిణులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగిస్తూ నానా తంటాలు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉప కేంద్రాల నిర్మాణాల కోసం ప్రభుత్వం నుంచి 2023లో నిధులు మంజూరైనప్పటికీ భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిధులున్నప్పటికీ కాంట్రాక్టర్లు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. శాశ్వత భవన భవనాలు నిర్మిస్తే అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయని అనుకున్న వారి సంబరం కాస్త కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో అందని ద్రాక్షలా మారింది. ఈ మూడు గ్రామాలకు స్థలం కేటాయింపు జరిగి, రూ.20లక్షలతో ప్రొసీడింగ్ కాపీ వచ్చి సంవత్సరం అవుతున్నా ఇంత వరకు సబ్ సెంటర్ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సబ్ సెంటర్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వంపై అద్దె భారం కూడా తప్పుతుంది. కానీ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియడంలేదని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వచ్చిన నిధులు వెనక్కి వెళ్లకుండా ఇప్పటికైనా సబ్ సెంటర్లకు మళ్లీ టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ఆశావర్కర్లు కోరుతున్నారు.


వేతనంలో నుంచి అద్దె చెల్లించాల్సి వస్తోంది : తోట సదానందం (పీడీఎంఓ కాంట్రాక్టు ఉద్యోగి)

గతంలో పర్మినెంట్ ఏఎన్ఎంలు వారికి ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.10వేలు అలవెన్స్ రూపంలో వచ్చేవి. వాటి ద్వారా అప్పుడు వారు ఆరోగ్య ఉప కేంద్రాల నెలసరి అద్దెలు చెల్లించే వారు. కానీ ఇప్పుడు మేము కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాం. మాకు ఆరోగ్య ఉపకేంద్రాల అద్దెలు చెల్లించడం భారంగా మారింది. నెలకు రూ.1500 చెల్లించడం మాకు భారంగా మారింది.ఈ సెంటర్లకు కలిపి నెలకు అద్దె అర లక్ష దాటుతుంది. మూడు సెంటర్ల అద్దె పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్లపై పడుతుంది. మా జీతంలో నుంచి అద్దె చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.



నేటి నుంచి పదో పరీక్షలు షురూ..


- హాజరుకానున్న 9455 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 54పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఒక్కొక్క కేంద్రానికి ఒక స్క్వాడ్
- మూడు టీములుగా ఫ్లయింగ్ స్క్వాడ్స్



నవతెలంగాణ-వరంగల్

పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు 9455 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందుకు 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించడంతో పాటు విద్యుత్ సౌకర్యం ఉండేటట్లు ఏర్పాటు చేశారు.ప్రయివేటు పాఠశాలల నుంచి 3968విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 5587మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 284 మొత్తం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలు 140, ప్రైవేట్ పాఠశాలలు144 ఉన్నాయి. అందులోజిల్లా వ్యాప్తంగా బాలికలు 4624, బాలురు 4831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలను ఏర్పాటు చేశారు. అందులో రెవెన్యూ విభాగం నుండి డిప్యూటీ తాసిల్దార్, పోలీస్ విభాగం నుంచి ఏఎస్ఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో పాటు గెజిటెడ్ అధికారి కూడా ఉంటారు. ఎలాంటి మాస్‌కాపీ జరగడానికి తావు లేకుండా పకడ్బద్ధిగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేసినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు నేడు ప్రారంభమై ఏప్రిల్ 2వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విద్యా సంవత్సరం ఏడు పరీక్షలలో భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు వేర్వేరుగా నిర్వహించనున్నారు. ఏ పాఠశాల విద్యార్థులకైనా హాల్ టికెట్లు అందకుంటే www. bse. telangana. gon.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం చుట్టుపక్కల 144సెక్షన్ అమలు, కేంద్రం చుట్టుపక్కల గల జిరాక్స్ సెంటర్లను పరీక్షా సమయం పూర్తి అయ్యే వరకు మూసివేయనున్నారు. విద్యార్థులు గంటలోపు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. ఉదయం 9:45 గంటల తరువాత పరీక్ష హాల్లో కి అనుమతి ఉండదు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించ బడవు పరీక్ష రాసే విద్యార్థులు టీఎస్ఆర్టిసి బస్సుల్లో హాల్ టికెట్ చూపించి పరీక్ష కేంద్రాలకు వెళ్లవచ్చు.

విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి : వాసంతి (డీఈవో)



పదవ తరగతి విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి. గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష రాసేందుకు రైటింగ్ పాడ్ తీసుకొని వెళ్లాలి. సరిపడా పెన్నులో పెన్సిల్లో లబ్బర్లు స్కేలు తమతో తీసుకుని రావాలి. ఇన్విజిలేటర్ తమకు మెయిన్ ఆన్సర్ బుక్‌కు జతపరచి ఇచ్చిన ఓఎంఆర్ తమదే అని ధ్రువీకరించుకొని పరీక్ష రాయడం మొదలు పెట్టాలి. జవాబుపత్రం రెండు వైపులా బ్లూ లేదా బ్లాక్ ఇంక్ పెన్నుతో స్పష్టంగా ప్రశ్నల నెంబర్లను తెలుపుతూ సమాధానం రాయాలి. ఎరుపు ఆకుపచ్చ రంగుల పెన్నులు వాడొద్దు.

కక్షిదారులకు సత్వర న్యాయం దిశగా పని చేయాలి



- హైకోర్టు జడ్జీ కే.లక్ష్మణ్

నవతెలంగాణ-నర్సంపేట

కక్షిదారులకు సత్వర న్యాయం అందించే దిశగా కోర్టులు పని చేయాలని హైకోర్టు జడ్జి కే.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం నర్సంపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి , అదనపు జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభించారు . ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.లక్ష్మణ్, నామావరపు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.1937లో ప్రారంభమైన నర్సంపేట కోర్టుకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. అనుభవజ్ఞులు, ప్రతిభవంతులు ఈ కోర్టులో పని చేయడం ఈ ప్రాంత వాసుల అదష్టం అన్నారు. కేసులు ఎక్కువ పెండెన్సీ ఉన్న కారణంగా అడిషనల్ కోర్ట్ మంజూరు చేశామని, ఇక నుంచి సంవ త్సరాల కొద్ది పెండింగ్ ఉన్న అనేక కేసులకు సత్వరమే పరిష్కార మౌతాయన్నారు. న్యాయవాదులంతా ఎప్పటిక ప్పుడు అప్డేట్ అవుతూ ప్రతిభను సంతరించుకుంటూ కక్ష దారులకు న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించాలని సూచించారు. నర్సంపేట బార్ అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు పూర్వకాలపు బిల్డింగ్‌ను రెనోవేషన్ చేయించాలని, రికార్డు రూమ్‌లను సరైన రీతిలో భద్ర పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు జిల్లా న్యాయస్థానాన్ని నర్సంపేటకు మంజూరు చేయాలని కోరగా జడ్జిలు సానుకూలంగా స్పందించారు. కార్య క్రమంలో భాగంగా 30సంవత్సరాల పైగా న్యాయవాద వత్తిలో నర్సంపేట కోర్టులో పని చేస్తున్న సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు రిజిష్టర్ నందికొండ నర్సింగరావు, వరంగల్ జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, హన్మకొండ జిల్లా న్యాయమూర్తి కష్ణమూర్తి, సబ్ జడ్జి సాయి కుమార్, జూనియర్ సివిల్ జడ్జి శిరీష, జిల్లాలోని వివిధ కోర్టు న్యాయమూర్తిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్ము రమేష్ యాదవ్, కార్యదర్శి సీలువేరు కిరణ్ కుమార్, ఉప అధ్యక్షుడు పుట్టపాక రవి, సీనియర్ అడ్వకేట్ అంబటి శ్రీనివాస్, కొడిదెల సంజయ్ కుమార్, తండా సరంగపాణి, తోగరు నర్సింహారెడ్డి, అర్ లక్ష్మీనారాయణ,,షేక్ రెహముద్దిన్, మోటూరి రవి, పోనుగోటి అజయ్, కొడెం శ్రీధర్, జన్ను మహేందర్, టీ సునిత, డి రంగనాథస్వామి, గుళ్ల ప్రభాకర్, మంకాలి ప్రభాకర్, తిరుమల్ చౌహాన్, బొడ్డుపెల్లి అజయ్, టి ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నేటి కలెక్టరేట్, బల్దియా ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ కలెక్టరేట్ సమా వేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదివారం ప్రకటనలో తెలి పారు. అధికారులు, సి బ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున రద్దు చేస్తు న్నట్లు తెలిపారు. ఈ విష యాన్ని గమనించి జిల్లా నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చు టకు కలెక్టరేట్ కార్యా లయానికి రాకూడదని కలెక్టర్ కోరారు.

వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యా లయంలో సోమవారం నిర్వ హించే ప్రజా వాణి కార్య క్రమాన్ని రద్దు చేస్తు న్నట్లు కమి షనర్ అశ్వినీ తానాజీ వాఖడే ప్రకటనలో తెలి పారు. ఈ విషయాన్ని గమనించి నగర ప్రజలు ఫిర్యాదులు ఇచ్చే వారు బల్దియా కార్యాలయానికి రాకూ డదని ఆమె సూచించారు.

శ్రామికవర్గ ఉద్యమానికి మార్గదర్శి లింగమూర్తి

ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాధినేని

నవతెలంగాణ-కాశిబుగ్గ

విప్లవ శ్రామిక వర్గ ఉద్యమానికి కూరపాటి లింగమూర్తి అలియాస్ రామారావు మార్గదర్శి అని ఐఎఫ్టియు జాతీయ కమిటీ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని 26వ డివిజన్ లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కష్ణ అధ్యక్షతన లింగమూర్తి సంతాప సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు ముందుగా లింగమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరంలో వివిధ కార్మిక ఉద్యమాలలో పని చేస్తూనే విప్లవ కార్మిక సంఘాల నిర్మాణానికి లింగ మూర్తి ఎంతో కషి చేశారని తెలిపారు. అంచలంచెలుగా ఐఎఫ్ టీయు జాతీయ నాయ కునిగా ఎదిగిన లింగమూర్తి అనారోగ్యంతో మరణించడం కార్మికవర్గానికి తీరని లోటు అన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించి వేస్తుందని వాటిని కాపాడుకొనుటకు బలమైన కార్మిక ఉద్యమాల నిర్మాణం చేయడమే లింగమూర్తికి మనం అందించే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జాతీయ కమిటీ సభ్యులు మోహన్, ఎండి రఘుద్దీన్, రామకష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీతారామయ్య, అనురాధ, జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ వివిధ సంఘాల నాయకులు బండి కోటేశ్వరరావు, ఎలకంటి రాజేందర్, రాచర్ల బాలరాజు, లింగమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

నవతెలంగాణ-నెక్కొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేరు కులానికి మేర కార్పొరేషన్‌ను ప్రకటించిన సందర్భంగా నెక్కొండలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మండల మేరు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటానికి పాలాభి షేకం చేశారు. వరంగల్ జిల్లా మేరు సంగం అధ్యక్షులు పెండ్యాల హరి ప్రసాద్ మేరు మాట్లాడుతూ తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తూ 16కార్పొరే షన్‌లు ప్రకటించడం హర్షనీయమన్నారు. మేర కార్పొరేషన్ ప్రక టించినందు కుగాను సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలకు వరంగల్ జిల్లా మేరు సంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోనెక్కొండ మేరు సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తకొండ గణేష్, నెక్కొండ పట్టణ మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామగిరి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట ఎస్సైగా సిహెచ్. ప్రమోద్‌కుమార్ ఇటీవల ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుర్రం రవీందర్, మాజీ సర్పంచ్‌లు వల్పదాసు చంద్రమౌళి, బైరి శ్రీనివాస్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, నాయకులు పల్లెబోయిన సారయ్య, అడుప ప్రభాకర్, ఎండి రాజమహమ్మద్, మారెపల్లి సదానందం, అరికిళ్ల విజయ్, బుర్ర విజయ్ గౌడ్, నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ఎంపీ వైద్యులు

ఆర్ఎంపీ వైద్యులు మర్యాదపూర్వకంగా ఎస్సైని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి సంఘం మండలాధ్యక్షులు కానుగుల నాగరాజు, రంగు శ్రీధర్, వినోద్, ఎండి సలీం, బాసాని సాంబమూర్తి, గట్టు కిషన్, రామ రాజ్ కుమార్, సమ్మయ్య, మురళి, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-ఆత్మకూరు

నేటి నుంచి రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని,ఈ పరీక్షలకు మొత్తం 562 విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎంఇఓ రమాదేవి తెలిపారు. నేటి నుంచి ఏప్రిల్ 2వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలు సజావుగా జరిగేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-సుబేదారి

49వ డివిజన్ అధ్యక్షుడు ఎండీ సమద్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన మూడు నెలలలోపే ప్రజల అభివద్ధి, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఆకర్షితుడై కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు.కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ అబ్బుబక్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 9మందిపై కేసు నమోదు

నవతెలంగాణ-శాయంపేట

ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రేమ జంట ఇంటిపై పెళ్లికూతురు బంధువులు దాడి చేసిన ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు 9మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం....శాయంపేట గ్రామానికి చెందిన గొండ రవి కుమారుడు గొండ నాగరాజు, సైదాపూర్ మండలం గణపురం గ్రామానికి చెందిన కళ్లెపు శ్రావణి కొంతకాలం నుండి ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 12న నరసింహస్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పెళ్లికూతురు తల్లి బంధువులు ఈ నెల 14న శాయంపేటకు వచ్చి పోలీస్‌స్టేషన్లో సంప్రదించగా శాయంపేట పోలీసులు కౌన్సెలింగ్ చేసి పంపించినట్లు తెలిపారు. పెళ్లికూతురు తల్లివారు దాదాపు పదిమంది ఈ నెల 16న పెళ్లి కుమారుడి ఇంటిపైకి వెళ్లి దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన పెళ్లికూతురు తల్లి అల్లెపు రజిత, అన్న భరత్, తిరుపతి, సరోజన, అనిల్, సమ్మక్క, అనిత, స్వరూప, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-శాయంపేట

ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై పురుగుల మందు తాగి వ్యక్తి ఎండీ యాకూబ్ (45) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సిహెచ్. ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం...మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఒక కూతురు కుమారుడు కలరు. కుమార్తె వివాహం చేసి ఇల్లు నిర్మించుకోగా రూ.5లక్షల వరకు అప్పు అయ్యింది. కూలి పని చేసి అప్పు ఎలా తీర్చాలో పోయాక మద్యానికి అలవాటు పడ్డాడు. యాకూబ్ భార్య ఎండీ ఖైరున్ బీ కూలి పని చేసి అప్పు తీర్చుదామని ధైర్యం చెబుతూ ఉండేది. ఈ నెల 15న రాత్రి మద్యమత్తులో యాకూబ్ ఇంట్లో ఉన్న గడ్డి మందు సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లగా, గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. యాకూబ్ భార్య ఖైరున్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.



స్వచ్ఛందంగా ఫ్లెక్సీలు తొలగింపు

నవతెలంగాణ-శాయంపేట

పార్లమెంట్ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లో వచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మారపల్లి పీటర్ ఆధ్వర్యంలో ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు స్వాగతం తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించారు. శాయంపేట తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, బస్సు షెల్టర్ ముందు, అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫ్లెక్సీలను తొలగించినట్లు తెలిపారు. శాయంపేటలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మల్టీపర్పస్ సిబ్బందితో తొలగించారు. ఇటీవల ప్రారంభించిన శంకుస్థాపన శిలాఫలకాలకు బ్లాక్‌కవర్‌ను తొడిగారు.

కుడా చైర్మన్ 'ఇనుగాల'కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఆత్మకూరు



కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఇనుగాల వెంకటరామిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంద ర్భంగా ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మెన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ ఇను గాలకు శు భాకాంక్షలు తెలి పారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమా వేశంలో రవీందర్‌గౌడ్ మాట్లా డుతూ పరకాల నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలకు అండదండగా ఉంటూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కషి చేసినందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం ఇనుగాలకు కుడా చైర్మెన పదవి ఇచ్చిందని, వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ మహానగరం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆకాంక్షించారు.

పార్లమెంటు ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

కలెక్టర్ సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న పార్లమెంటు ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఆదివారం ఉదయం హన్మకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి సహకరించాలని కోరారు. ఏప్రిల్ 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఏప్రిల్ 25 తుది గడువని తెలిపారు. 26న నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువని చెప్పారు. మే 13వ తేదీన పార్లమెంటు నియోజకవర్గంలో పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలున్నాయన్నారు. పరకాల నియోజకవర్గంలో 239, వరంగల్ పశ్చిమ నియోజకరవ్గంలో 244 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. పరకాలలో 2 లక్షల 22 వేల 266 మంది ఓటర్లు, వరంగల్ పశ్చిమలో 2 లక్షల 81 వేల 798 మంది ఓటర్లున్నారన్నారు. రూ.50 వేలకుపైబడి రూ.10 లక్షల నగదు వరకు తనిఖీలలో పట్టుబడితే సంబంధితాధికారులకు సరైన ధృవీకరణ పత్రాలను చూపిస్తే తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. రూ.10 లక్షలకు పైగా నగదు పట్టుబడితే ఆ మొత్తాన్ని ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామన్నారు.

10కంపెనీల కేంద్ర బలగాలు : అంబర్ కిషోర్ ఝా

పార్ల మెంటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి 10 కంపెనీల కేంద్ర బలగాలు ఇప్పటికే చేరుకున్నాయని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మూడు జిల్లాలున్నాయని ఒక్కో జిల్లాలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. అక్రమ నగదు, మద్యం పట్టుకోవ డానికి సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. గట్టి నిఘా విధించామన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్వో వైవీ గణేష్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.నాగిరెడ్డి

నవతెలంగాణ-హన్మకొండ

రాష్ట్రవ్యాప్తంగా పేరుకపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా ముఖ్య కార్యకర్తల ఆదివారం నిర్వహించగా పి నాగిరెడ్డి మాట్లాడారు. ఈ నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో వేసవి దష్ట్యా సిబ్బందికి కనీస వసతుల ఏర్పాటు పట్ల దష్టి సారించాలని అధికారులను కోరారు. గతంలో రిటైరైన వారికీ ఇంతవరకు సరిగా బెనిఫిట్స్ అందలేదని, మార్చి నుండి కూడా రిటైర్మెంట్‌లు ఉన్నందున వారికి రావాల్సిన గ్రాట్యూటీ,కమ్యూటేషన్, లీవ్ ఎన్క్యాష్మెంట్ వంటి తదితరాలను వెంటనే చెల్లించాలని నాగిరెడ్డి గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో



రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ సీనియర్ నాయకులు బిల్లా సుబ్బరావు, రమేష్, లక్ష్మయ్య కుమారస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

హన్మకొండ అనాథ ఆశ్రమ హాస్టల్‌లో ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. పాఠశాలలో 1979-80లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సుమారు 35ఏళ్ల తరువాత మళ్లీ కలుసుకున్నారు. సుమారు 100మంది పూర్వ విద్యార్థులు తమ స్నేహితులతో కలిసి వచ్చి ఆప్యాయ పలకరింపులతో సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు. అనంతరం హాస్టల్‌లో తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బండారి రవీందర్, శనిగారపు సురేష్, వెంకటేష్, రంజిత్ కుమార్, పి వెంకన్న, రవీంద్రచారి పాల్గొన్నారు..



మాకేదీ గుర్తింపు..?

పదేండ్ల పాటు పార్టీ కోసం కష్టపడ్డాం
కిందిస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలంటున్న కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

పదేళ్ల పాటు కేసులకు భయపడకుండా పార్టీని కాపాడుకున్న తమకు గుర్తింపు దక్కడం లేదని కిందిస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పని చేసిన తమను కాదని అధికారంలోకి రాగానే కండువా కప్పుకున్న వారిని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే వెన్నుపోటు పొడిసెందుకు ప్రయత్నం చేసిన కబాలీలను అందలమెక్కిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు ఏమాత్రం గుర్తింపు దక్కకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ గ్రామ,మండల స్థాయి నాయకులు వాపోతున్నారు. కొందరు నాయకులు ద్వితీయ, తతీయ నాయకులు తమను ఏమాత్రం ప్రోత్సహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరసగా పదేండ్ల పాటు అధికారం లేకున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత అణగదొక్కిన, కేసులకు, వేధింపులకు గురి చేసినా, ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు సాగమని కార్యకర్తలు చెబుతున్నారు. తాము పార్టీ కోసం ఇంత కష్టపడితే అధికారంలోకి వచ్చిన వేంటనే తమకు గుర్తింపు ఇవ్వకపోగా శాసనసభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులకు కోవర్ట్ చేస్తూ కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడవాలని చూసేవారికే నామినేటెడ్ పదవుల ఇవ్వడంపై సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు గురవుతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి...

ఏళ్ల తరబడి పార్టీ కోసం పాటుపడిన తమకు స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ,మండల, జిల్లా స్థాయి సీనియర్ కాంగ్రెస్ నాయకులు,యూత్ నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పార్టీ భవిష్యత్ దష్టిలో ఉంచుకొని ద్వితీయ, తతీయ నాయకులను ప్రోత్సహించాలని కోరుతున్నారు.బిజెపి,బిఆర్ఎస్ ల ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతున్న వారిని ప్రోత్సహించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



పగలే వెన్నెల..!

నవతెలంగాణ-మంగపేట

శీర్షిక చూడగానే ఆకాశంలో సూర్యుడు వుండగానే చంద్రోదయం అయ్యిందని అనుకునేరు.అసలు విషయం ఏమిటంటే మండలంలోని కొత్తపేట గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా పట్ట పగలు 12 గంటలు దాటిన వీధి దీపాలు వెలుగుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో వచ్చేది ఉచిత విద్యుత్తే కదా అని గ్రామ పంచాయతీ వారు తమ ఔదార్యాన్ని చాటుతూ పగలు కూడా వెలుగును పంచుతుండడం పట్ల పలువురు విమర్శించడం గమనార్హం.

మత్స్యకారులకు సువర్ణ అవకాశం...

- జిల్లాలో 116 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు
- 8598 మంది సభ్యులు
- ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలు
- సంచార మత్స్య విక్రయ వాహనాల పంపిణీ
- మత్స్య కారుల సామూహిక బీమా పథకం
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న మత్స్యశాఖ
- సభ్యత్వం తీసుకుంటే ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తింపు





నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్రంలో వేగంగా అభివద్ధి చెందుతున్న రంగాలలో మత్స్య రంగం ఒకటి. ఆదాయం ఉపాధిని ఉత్పత్తి చేస్తుంది. ఈ రంగం సహజముగా , కల్చర్ ద్వారా చేపలు పెంచుతూ సాధ్యమయ్యే అన్ని వనరులను అభివది చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. స్థిరమైన అభివద్ధి ద్వారా చేపల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి కషి చేస్తుంది. ఆహార భద్రత, పోషణ మరియు ఆరోగ్యం, గ్రామీణ జనాభాకు సహజమైన ఆహార భద్రత మరియు మత్స్యకారుల సంక్షేమం కోసం ఈ రంగం దోహదం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటున్నది. రాయితీపై సమీకత మత్స్య అభివధి పడకం క్రింద కచ్చు వలలు, విసురు వలలు, పాండ్రి వలలు, తెప్పలు, శీతలీకరణ పెట్టెలు, మోపెడ్స్, నాలుగు చక్రాల వాహనాలు, ప్లాస్టిక్ ట్రేలు, కాంటా, బోట్లు, పుట్లు అందిచరు. ఏటా చెరువుల్లో వందశాతం రాయితీపై చేపపిల్లలు,రొయ్య పిల్లలను వదులుతున్నది. మత్స్యకారులకు 5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నది. ఇప్పటికే మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసి మత్స్యకారులకు సబ్సిడీలు ఇస్తున్నది. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్ సూచించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాలు ఉండగా మొత్తం 116 మత్స పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 89 మత్సపారిశ్రామిక సహకార సంఘాలు, 24 మహిళా సంఘాలు 1 గిరిజన సహకార సంఘం, 1 షెడ్యూల్ కులాల మత్స సహకార సంఘం, 1 మత్స లైసెన్స్ దారుల సహకార సంఘం,1మత్స మార్కెటింగ్ సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలలో మొత్తం 8598 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 835 చెరువులలో సుమారు 2 కోట్ల 8 లక్షల పెద్ద చేప పిల్లలను, 839 చెరువులలో 2 కోట్ల 93 లక్షల 98 వేల చిన్న చేప పిల్లలను, 5 చెరువులలో 35 లక్షల 37 వేల రొయ్య పిల్లలను గత సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన..

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేపల చెరువు నిర్మాణం, ద్విచక్ర వాహనం, చేపల దాన మిల్లు, నిర్మాణం, సంచార మత్స విక్రయ కేంద్రం, యూనిట్స్ ఈ పథకంలో ఇచ్చుటకు జిల్లాల మొత్తం 89 చేపల చెరువుల కు సుమారు 79 హెక్టార్లలో నిర్మాణానికి అనుమతి లభించింది. ఇందులో 23 హెక్టార్లలో నిర్మాణం పూర్తికాగా ల సబ్సిడీ రాయితీ 74 లక్షలు రూపాయలు లబ్ధిదారు ఖాతాలో జమ చేశారు.

సంచార మత్స్య విక్రయ వాహనాలు...

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా చేపల వ్యాపారం, తినడానికి తయారుగా ఉన్న చేపల ఉత్పత్తులు విలువ పెంచే ఉత్పత్తుల తయారీ చేపల ఆహారం వ్యాపారం చేసుకోవడానికి జిల్లాలో ని మంథని నియోజకవర్గంలో పాటు భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 27 మంది లబ్ధిదారులకు సబ్సిడీ ద్వారా వాహనాలను అందించడం జరిగింది. అదేవిధంగా చేపలను సరఫరా చేయడానికి 32 మంది లబ్ధిదారులకు త్రీచక్ర వాహనాలను తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా వేరువేరుగా సబ్సిడీలో అందించడం జరిగింది.

మత్స్య కారుల సామూహిక బీమా పథకం..

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. ప్రమాదవ శాత్తు అంగవైకల్యం చెందితే 2 లక్షల 50 వేలు ఇవ్వడం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటివరకు పదిమంది దరఖాస్తుదారులకు ఐదు లక్షల చొప్పున 55 లక్షల రూపాయలను బాధితుల కుటుంబాల ఖాతాలో జమ చేయడం జరిగింది.

సద్వినియోగం చేసుకోవాలి : ఆర్. అవినాష్, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసు కోవాలి. ఈ పథకాలలో జనరల్, బిసి కులాలకు యూని ట్ కాస్ట్ లో 40% సబ్సిడీ వర్తి స్తుంది. ఎస్సీ ఎస్టీ మహిళలకు 60% సబ్సిడీ వర్తి స్తుంది. మొబైల్ టిఫిన్ వాహనానికి 40 నుండి 60 శాతం, త్రీ చ క్ర వా హ నం కొనుగోలులో 40 నుండి 60 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. కావున ఆసక్తిగల ప్రజలు సభ్యత్వం తీసుకుని, పథకాలకు దరఖాస్తులు చేసుకుని రాయితీ పొంది ఆర్థిక అభివద్ధి చెందాలి.



వ్యాయామ విద్యలో 'సముద్రాల'కు డాక్టరేట్

నవతెలంగాణ-జఫర్‌గడ్



మండల కేంద్రానికి చెందిన సముద్రాల సోమ నర్సయ్యకు డాక్టరేట్ లభించడం అభినందనీయమని ప్రొఫెసర్ పి.రమేశ్ రెడ్డి అన్నారు. పీహెచ్డీ సూపర్వైజర్ అయిన ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి కిట్స్ వరంగల్ గారి ఆధ్వర్యంలో "అన్ అనాలసిస్ ఆన్ ఆంత్రో పోమెట్రిక్ మెజర్మెంట్స్ అండ్ ఫిజికల్ కాంపోనెంట్స్ ఎమాంగ్ జూనియర్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ రిలేషన్ టు దేర్ పెర్ఫార్మెన్స్" లో రీసెర్చ్ పూర్తిచేసి కాకతీయ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డీన్ ప్రొఫెసర్ రామనాథ్ కిషన్, కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ రవికుమార్, ప్రిన్సిపల్ ఏటీబీటీ ప్రసాద్ అభినందించారు.

సోమేశ్వరస్వామికి వెండి కలశం బహూకరణ

నవతెలంగాణ-పాలకుర్తి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనం 'సింహ స్వామి ఆలయానికి పాలకుర్తి గ్రామానికి చెందిన పొన్నాల వీరయ్య చంద్రకళ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రూ.40 వేల విలువైన 500 గ్రాముల వెండి కలశంను స్వామివారికి సమ ర్పించేందుకు ఈవో భాగం లక్ష్మీప్రసన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నాల శోభన్‌బాబు, స్పందన, గణేష్, గీత, సతీష్ రమాదేవి పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-జఫర్‌గడ్

మండలంలోని కూనూరు గ్రామ ఉన్నత పాఠశాలలో 1978 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం తమ్మడపల్లి ప్రకతి చికిత్సలయ ఆవరణలో కలుసుకొని తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ అపూర్వ కలయిక సందర్భంగా 25మంది వారి వారి కుటుంబాలతో ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని తమ గురువులు నేర్పిన విద్య, క్రమశిక్షణ గురించి నెమరు వేసుకున్నారు. చనిపోయిన తమ బాల్య మిత్రుల గురించి తలచుకొని వారికి ఘనంగా నివాళులు అర్పించారు. హాజరైన వారందరూ తమ జీవిత భాగస్వామితో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా తమ గురువులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిలువేరు రవీందర్, ఎం. జయసింహారెడ్డి,పి.నాగార్జున ప్రసాద్,తోట భాస్కర్, పద్మ,బి. పిచ్చి రెడ్డి, బొద్దున వెంకటేశ్వర్లు, బద్రీనాథ్, ఎం. నరసయ్య పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులు ప్రారంభం


నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

మండలంలోని నమిలిగొండ గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపట్టిన మహిళా కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు పనులకు ఎంపీటీసీ పురుమాని రజాక్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కమ్యూనిటీ, సీసీ రోడ్డు పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి, గత ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరు చేసి ప్రొసీడింగ్స్ కాపీ అందించారు. గ్రామ అభివద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చందు, మహిళా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి రద్దు

నవ తెలంగాణ-జనగామ కలెక్టరేట్

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ (కోడ్) ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రజావాణి కార్యక్రమాల తేదీలను ఎన్నికల (కోడ్) ముగిసిన తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. ప్రజావాణిని రద్దు చేస్తున్నందున ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.



కాంగ్రెస్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ జనగామ మండల శాఖను ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రకటించారు. అధ్యక్షులుగా లింగాల నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా మెరుగు రాజేందర్ గౌడ్, సంకటి యాదగిరి, కొమ్ము బాల నర్సయ్య, బన్సీ లాల్ నాయక్, కార్యదర్శిగా తొట్టె నరేందర్, సహాయ కార్యదర్శిగా రెడ్డబోయిన రవీందర్, జినుకాల రాజు, కోశాధికారిగా వెంకర్యాల మాజీ సర్పంచ్ కాల్నే ఉప్పలయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మూరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం దిశగా పనిచేయాలని, ఆరు గ్యారంటీలను అర్హులైన వారందరికీ అందించాలని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి, సిద్ధంకి మాజీ సర్పంచ్ సు%శీ%కరి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నర్సింగరావు, మాజీ ఎంపీపీ ధర్మ గోవర్ధన్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు శివరాజ్ యాదవ్, చీటాకోడూరు-యశ్వంతాపూర్ ఎంపీటీసీ మెరుగు బాలరాజు గౌడ్, మాజీ ఎంపిటిసి దూడల సుబ్బయ్య గౌడ్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల నియామకం

కాంగ్రెస్ పార్టీ జనగామ మండలంలోని గ్రామ శాఖలకు అధ్యక్షులను నియమిస్తూ ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పసరమట్ల గ్రామానికి అధ్యక్షులుగా కుర్రెముల రవికుమార్ గౌడ్ ను, పెంబర్తి గ్రామ శాఖ అధ్యక్షులుగా బంద్రు సిద్ధులు, ఎర్రగుంట తండా అధ్యక్షులుగా రమావత్ శ్రీకాంత్, ఓబుల్ కేశవాపూర్ అధ్యక్షులుగా జన్నెపల్లి జనార్ధన్ రెడ్డి, ఎర్రగొల్లపహాడ్ పార్టీ అధ్యక్షులుగా మెరుగు శ్రీనివాసులుకు నియామక పత్రాలను అందజేశారు. యశ్వంతాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులుగా గడ్డం రవి, ఎల్లంల అధ్యక్షులుగా బండ విజయ్, చౌడారం గ్రామ అధ్యక్షులుగా మునిగే వెంకటేశ్వర్లు, పెద్దపహాడ్ అధ్యక్షులుగా జడల మల్లేష్, గోపిరాజుపల్లి గ్రామ అధ్యక్షులుగా కడకంచి కొమురయ్య, వడ్లకొండ అధ్యక్షులుగా దండబోయిన ధర్మేందర్, అడవికేశవపూర్ అధ్యక్షులుగా భానోత్ బిక్షపతి, శామీర్ పేట అధ్యక్షులుగా చాడగొండ కష్ణారెడ్డి, మరిగడి అధ్యక్షులుగా కర్రే పరశురాములు, చిటకూడు అధ్యక్షులుగా చిక్కుడు వెంకటేష్, గానుగుపహాడ్ గ్రామ శాఖ అధ్యక్షులుగా ముక్కెర యాదగిరి, సిద్ధంకి అధ్యక్షులుగా వడ్లకొండ బిక్షపతి, వెంకిర్యాల అధ్యక్షులుగా మద్దెల ప్రసాద్, ఎర్రగొల్లపహాడ్ తండా అద్యక్షులుగా తేజ లక్ష్మణ్, పెద్ద తండా అధ్యక్షులుగా గుగులోతు వాలియా, పెద్దరామ్చర్ల అధ్యక్షులుగా ఎండి రహీమ్ లను నియమించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామాల్లో పార్టీ ప్రతినిధులుగా కషి చేయాలని చెప్పారు.

పేదలకు భూములు పంచే వరకూ పోరాటం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ-బచ్చన్నపేట



పేదలకు భూములు పంచేదాకా సీపీఐ(ఎం) ముందు వరసలో ఉండి పోరాడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న రామంచర్ల పరిధిలో గల 174 సర్వే నెంబర్లో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను పోలీసుల అత్యుత్సాహంతో తొలగించి నిరుపేదలపై అవలంబించిన తీరుపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా గుడిసెలు వేసిన నిరుపేదలను ఉద్దేశించి మాట్లాడారు. సీపీఐ(ఎం) పార్టీ నిరుపేదలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని,న్యాయం జరిగే వరకూ పార్టీ తోడుంటుందని భరోసా కల్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరు ప్రతాపరెడ్డి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంలో తన వంతు కషి చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి రాగానే దోచుకునేలా చూస్తున్నాడని ఆరోపించారు. మూడు పార్టీలలో ఉన్న నాయకులు పేదలను పట్టించుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయరని, ఎన్నికల సమయంలో పేదలకు ఉచిత హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన తర్వాత వారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ మాట్లాడుతూ 174 సర్వే నెంబరు ప్రభుత్వ అసైన్డ్ భూమిలో మండలంలోని అర్హులైన ఇల్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటుంటే పోలీసులు గుడిసెవాసులను విచక్షణారహితంగా మహిళలు అని చూడకుండా కొట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నర్మెట్ట సీఐ,ఎస్సైలు మహిళలను ఇష్టం వచ్చినట్లు లాగడం నెట్టివేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఏసిపి దగ్గరుండి ఇలాంటి చర్యలను చేపట్టడం మంచి పద్ధతి కాదన్నారు. జనగామ ఏసిపి నర్మెట్ట సీఐ నర్మట ఎస్ఐలపై మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. 174 సర్వే నెంబర్ లో ఉన్న 8-16 గుంటల భూమి రెవెన్యూ కోర్టు పూర్తిగా ప్రభుత్వ భూమి అని తీర్పునిచ్చిన ఆ ఆర్డర్ కాపీని బచ్చన్నపేట తహసీల్దార్ హైకోర్టుకు అందించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పటికైనా 174 సర్వే నెంబర్ భూమిని నిరుపేదలకు పంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ భూసాధన కమిటీ కన్వీనర్ పర్వతం, నరసింహులు, రామగల్ల అశోక్, మిన్నలాపురం ఎల్లయ్య, వెంకటవ్వ, రాజవ్వ పాల్గొన్నారు.

నాడు బార్డర్‌లో.. నేడు జిల్లా ఏరియా ఆసుపత్రిలో..

సొంత గడ్డపై వైద్య సేవలు అందిస్తున్న కల్నన్ డాక్టర్ బిక్షపతి

అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలో తనదైన ముద్ర

నవతెలంగాణ-పాలకుర్తి



పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యం : డాక్టర్ కల్నన్ బిక్షపతి

సొంత గడ్డపై పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బార్డర్‌లో వైద్యాధికారిగా పని చేస్తూ, స్వచ్ఛంద పదవి విరమణ పొందిన డాక్టర్ కల్నన్ మాచర్ల బిక్షపతి పేద ప్రజలకు వెన్నంటి ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. పాలకుర్తి మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన కల్నన్ డాక్టర్ మాచర్ల బిక్షపతి మాచర్ల మల్లయ్య, కొమరమ్మ లక్ష్మి దంపతులకు మూడవ సంతానం. పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి, ఉన్నత చదువులకు ఇతర ప్రాంతాలకు వెళ్ళాడు. ఎంబీబీఎస్ లో డాక్టర్ పట్టా పొందిన మాచర్ల బిక్షపతి 1998 అక్టోబర్ 11 న బార్డర్ పోలీస్ వైద్యాధికారిగా కాశ్మీర్ లో బాధ్యతలు స్వీకరించారు.

లక్నో పశ్చిమబెంగాల్ నాసిక్ శ్రీనగర్ ఢిల్లీ కర్ణాటక కేరళ మద్రాసు రాష్ట్రాల్లో సైనిక పోలీస్ వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితి దక్షిణాఫ్రికా, నేపాల్ దేశాల్లో వైద్యా రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. పుట్టిన గడ్డపై వైద్య సేవలు అందించి పేద ప్రజలకు అందుబాటులో ఉండాలనే కత నిశ్చయంతో 2021 డిసెంబర్‌లో స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. గ్రామీణ ప్రాంత పేదలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆదరభిమానాలు పొందారు. తన సొంత వాహనంలోనే పేదలకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేకమందిని ప్రాణాలతో కాపాడిన ఘనత డాక్టర్ కల్నన్ బిక్షపతి సొంతం. జనగామ జిల్లా కేంద్రంలో గల ఏరియా ఆసుపత్రిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ బిక్షపతిని అసోసియేట్ ప్రొఫెసర్గా నియమిస్తూ జనగామ ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ గోపాల్ రావు నియామక పత్రంతో పాటు ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్టిన గడ్డపై పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా బార్డర్లో పనిచేస్తూ స్వచ్ఛంద పదవి విరమణ పొందానని డాక్టర్ కల్నన్ మాచర్ల బిక్షపతి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు. పేదలకు వైద్యం మరింత అందుబాటులో ఉండే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి జనగామ ఏరియా ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించడం ఆనందంగా ఉందని తెలిపారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాచర్ల సారయ్య

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. శనివారం పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామంలో నక్క రాజయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు బెల్లి సంపత్ అధ్యక్షత వహించగా నక్క రాజయ్య చిత్రపటానికి సారయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట గడ్డ పాలకుర్తి ప్రాంతమని గుర్తు చేశారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి ఉద్యమంలో రాజయ్య పాలకుర్తి ప్రాంతంలో రైతాంగ - కూలీల ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తి అని కొని యాడరు. తాను నమ్మినసిద్ధాంతాలకు కట్టుబడి ఎర్రజెండాను చేతబట్టి ప్రజా సమస్యల కోసం పనిచేసిన వ్యక్తి రాజయ్య అన్నారు.

పార్టీ నిరంతరం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ నిత్యం ప్రజల వెంటే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సాధం రమేష్, సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, సుధాకర్, పనికే ర రాజు, నాయిని శ్రీను, పనికిర భాస్కర్, మచ్చుపాడు సోమన్న, చేరి పెల్లి కొమురయ్య, తోటకూరి శాంతమ్మ, జంపయ్య, వారి కుటుంబ సభ్యులు నక్క రవి, నక్క సంజీవ, నక్క పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు నాగపురి కిరణ్‌గౌడ్ రాజీనామా

నవతెలంగాణ-బచ్చన్నపేట



బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లుగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఉన్న 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరి పాలు సామాజిక సేవకర్తలు నిర్వహించిన నాగపురి కిరణ్‌గౌడ్ తెలి పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పార్టీకి ఎంతో సేవ చేసినప్పటికీ ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారని అన్నారు. బీఆర్ఎస్ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఎస్సై ప్రమోద్ కుమార్

నవతెలంగాణ-శాయంపేట

పదో తరగతి పరీక్షలను దష్టిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ సిహెచ్. ప్రమోద్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఆదివారం ఎస్సై ప్రమోద్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను తీసుకువచ్చే తల్లిదండ్రులు గుంపులు గుంపులుగా గుమికూడవద్దని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద తమ పిల్లలను వదిలివేసి 100 మీటర్ల దూరంలో ఉండాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశాలు జారీచేశారు. యువకులు రాత్రి 10 తర్వాత రోడ్లపై తిరగవద్దని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ఉండవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడమే కాక, ఇన్సూరెన్స్, ఆర్ సి, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ వాహన పత్రాలను కలిగి ఉండాలన్నారు. రాత్రివేళ రోడ్లపై జులాయిగా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు నేరుగా తమ సమస్యలను విన్నవించుకుంటే సమస్యలను పరిష్కరిస్తామని, మధ్య దళాలను ఆశ్రయించవద్దని ఎస్సై ప్రమోద్ కుమార్ సూచించారు.





నిబంధనల మేరకు ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణ చేపట్టాలి

జిల్లా ఉప ఎన్నికల అధికారి జి. సంధ్యారాణి

నవతెలంగాణ-వరంగల్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిర్వహించాలని జిల్లా ఉప ఎన్నికల అధికారి జి. సంధ్యారాణి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించినప్పుడు లేదా ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేర్లు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్లు ప్రింట్ లైన్ యందు స్పష్టంగా సూచించాలని, ముద్రించబడిన ప్రతులను (ప్రింటడ్ మెటీరియల్ కాపీలను) 3 అదనపు ప్రింట్ లతో పాటు ప్రింట్ చేసిన మూడు రోజుల్లోపు ప్రచరణ కర్త నుండి పొందిన డిక్లరేషన్ తో సహా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నందు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127(ఏ) ప్రకారం పంపాలని తెలిపారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ లు ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, మొదలైన వాటి ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రోఫార్మా లో సెక్షన్ 127 ఏ (2) ప్రకారం ప్రచురణకర్త నుంచి డిక్లరేషన్ పొందాలని, డిక్లరేషన్ పై ప్రచురణకర్త సంతకం, సూచించిన ఇద్దరు వ్యక్తులచే ధ్రువీకరించబడాలని, దీనిని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమాని ధ్రువీకరించాలన్నారు.

ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషన్‌తో పాటు సూచించిన ప్రోఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాపీల సంఖ్య సదరు ప్రింటింగ్ పనికి వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రింటర్లు మూడు రోజుల్లోపు అందించాలని, అట్టి ప్రతి ముద్రించిన మూడు రోజుల్లోపు ముద్రించిన ఎన్నికల కరపత్రాలు పోస్టర్లు మొదలైన వాటికి సంబంధించిన సమాచారాన్ని ప్రింటర్ ఒకేసారి కాకుండా విడిగా అందించాలని, ఈ ఆదేశాలు ఉల్లంగిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ రద్దు చేయడంతో సహా ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఉప ఎన్నికల అధికారి అన్నారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వ నారాయణ, రమేష్, జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.


10 పరీక్షలకు సర్వం సిద్ధం

నోడల్ అధికారి నర్సయ్య

నవతెలంగాణ-పాలకుర్తి

నేటి నుండి జరిగే పది పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యాశాఖ నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు12, ప్రైవేటు పాఠశాలలు5, గురుకులాలు3, మొత్తం 20 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. 19 పాఠశాలల్లోని 637 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పాలకుర్తి సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఏ సెంటర్లో 180 మంది బి సెంటర్లో 167 మంది , ఉన్నత పాఠశాల పాలకుర్తి లో రెండు కేంద్రాల్లో ఏ సెంటర్లో 150 మంది బి సెంటర్లో 140 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. గూడూరు ఉన్నత పాఠశాలలోని 70 మంది విద్యార్థిని విద్యార్థులు స్టేషన్ ఘన్పూర్ మండలం ఇప్పగూడెం ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. ఉదయం 9:30 గంటల నుండి 12:30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, విద్యార్థిని విద్యార్థులు సమయపాలన పాటించి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. నాలుగు కేంద్రాలకు నలుగురు సిఎస్ లు,నలుగురు డి ఓ లు, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్ లతో పాటు 38 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ దీపాలతో పాటు ఫ్యాన్లు బిగించామని, విద్యుత్ దీపాలతో పాటు ఫ్యాన్లు బిగించామని, తాగు నీరును అందుబాటులో ఉంచామని తెలిపారు. పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులకు సహకరించాలని కోరారు.

బచ్చన్నపేట : నేటి నుండి 10 పరీక్షలు ప్రారంభం అవుతుండడంతో అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించి పరీక్షల సెంటర్లకు సకాలంలో చేరుకొని పరీక్షలు రాయాల్సిందిగా సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలని అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 140 మంది విద్యార్థులు, తెలంగాణ మోడల్ స్కూల్లో 120 మంది, అలాగే కొన్నె పాఠశాలలో 98 మొత్తం 418 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు నోడల్ ఆఫీసర్ మూర్తి తెలిపారు.



స్టేషన్ ఘనపూర్ : పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించబడుతుందని అన్నారు. 7పరీక్షా కేంద్రాల్లో, 1051 విద్యార్థులు పరీక్ష వ్రాస్తున్నట్లు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
4
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

గుర్తుతెలియని యాచకుడు మృతి

నవతెలంగాణ-తొర్రూర్



గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. 2 నెలలుగా ఓ యాచకుడు తొర్రూరు పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా యాచకుడు మృతి చెందాడన్న విషయం తెలు సుకున్న మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. యాచకుడి మృతి పట్ల స్పందించిన మున్సిపాలిటీ సిబ్బందికి పోలీసులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎస్సై రాంజీ నాయక్, సీహెచ్ఓ రాజ్ కుమార్, వార్డ్ ఆఫీసర్ దేవేందర్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బయ్యారం



మండలంలోని అల్లిగూడెం గ్రామంలో గత నెల 28న దార రాజకుమార్ మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మృతుడి స్నేహితులు 2000-2001 పదవ తరగతి స్నేహితులు ఆర్థిక పరామర్శించి రూ.38,000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్ లో రాజ్ కుమార్ పిల్లలకు చదువు, ఆరోగ్య రీత్యా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు రవీందర్ నాయక్, సతీష్, కె. వీరన్న, కృష్ణ, రవి రాజ్, రవి చందు, సుదర్శన్, సుధాకర్, ఐలయ్య, శివ కుమార్ అశోక్, నరేష్, కమల్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-గూడూరు

గూడూరు పోలీస్ స్టేషన్ పరిధి రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బాబురావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు, వారి సత్ప్రవర్తనకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ సీహెచ్ నగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-పెద్దవంగర

మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మచ్చ యాకమ్మ (64) ఇటీవల మృతి చెందింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె యాకయ్య, ఈదురు సత్యనారాయణ, ఈదురు సైదులు, ఈదురు యాకయ్య, సోమయ్య, రాంపాక రాములు, శ్రీకాంత్, వెంకన్న, జబ్బారి యాకయ్య పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఈదురు యాకయ్య, కారుపాటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా..

ట్రాక్టర్ పట్టివేత, కేసు నమోదు



నవతెలంగాణ-గార్ల

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చంద్రగిరి సమీపంలో పోలీసులు పెట్రో లింగ్ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా చలివాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ట్రాక్టరు యజమాని ఆగాల రామారావు పై కేసు నమోదు చేశారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేపడితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

సైబర్ నేరంపై బాధితుడి ఫిర్యాదు

నవతెలంగాణ-గార్ల

సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.లక్ష35 వేలు పోగొట్టుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన యువకుడు గుగులోతు సాయికుమార్ యూట్యూబ్‌లో వచ్చిన ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్ర పథకంలో ఆల్ ఇండియా ఫెర్టిలైజర్స్ కెమికల్ సహకారంతో ప్రవేశపెట్టారని బ్రోచర్లో తెలిపిన విధంగా కొంత సమాచారం కోరాడు. వాట్సాప్ ద్వారా లింకు పంపించగా తద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. దీనికి కొంత ఖర్చు అవుతుందని చెప్పగానే సాయికుమార్ పలుదపాలుగా ఫోన్ పే ద్వారా మొత్తం రూ. 1,35,000 రూపాయలు చెల్లించాడు. మరో రూ.75వేలు చెల్లించాలని చెప్పగా సైబర్ క్రైమ్ చేతుల్లో మోసపోయానని గ్రహించాడు. వెంటనే బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడే. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోస పోతే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మహనీయుల వర్ధంతి వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని వెంకట్రాంపురంలో దొరన్న స్మారక భవనం ఎదుట ఆదివారం మహనీయులు షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుకుదేవ్‌ల 93వ వర్ధంతి వాల్‌పో స్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు వురు నాయకులు మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్‌గురు, సుకుదేవ్ పోరాట స్ఫూర్తితో హిందుత్వ, మతోన్మాద, ఫాసిస్టు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడు దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం మండల నాయకులు మండల సహాయ కార్యదర్శి గుగులోత్ భద్ర, వీర చంద్రరాజు, కే అశోక్, అజ్మీర రాజు, వల్లాల మధు, జి సుమన్, జక్కుల బాలకృష్ణ, చందువెంకన్న, మునగాల సంపత్, తాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి '10' పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-పెద్దవంగర

పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలోని 5 జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటుగా, కేజీబీవీ విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ బీ. వెంకటేశ్వర్ రావు, డీవో వినోద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని పెద్దవంగర జెడ్పీ ఉన్నత పాఠశాల 51, అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల 25, వడ్డెకొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 15, బొమ్మకల్ జెడ్పీ ఉన్నత 10, చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల 25 మంది విద్యార్థులు, కేజీబీవీ నుండి 38 విద్యార్థులు, మొత్తం ఆరు పాఠశాలల నుండి 164 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులను 8 గంటల 30 నిమిషాలకు పరీక్ష కేంద్రంలోకి పంపిస్తామని, 9 గంటల 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు. ఈ సంవత్సరం నిమిషం నిబంధనలను సడలించి, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని తెలిపారు. కాగా పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.



నెల్లికుదురు : మండల కేంద్రంలోని గౌట్ హైస్కూల్లో 190మంది, టీఎస్ఎంఎస్ పాఠశాలలో 212 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారని సిఎస్‌లు ఎం రవి, శ్రీనుబాబు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, టీఎస్ఎంఎస్ పాఠశాలలో మొత్తం 402మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించామని తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ పాల్పడినా సహించేది లేదని తెలిపారు.

విచ్చలవిడిగా.. దుకాణ సముదాయాలు ?

- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు !

నవతెలంగాణ- మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో ఫుట్‌పాత్‌పై పలు దుకాణదారుల అరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయనే ఆరోపణలొస్తున్నాయి. మున్సిపాలిటీ పట్టణం దినదిన అభివృద్ధి చెందుతున్న సందర్భంలో ప్రజల రాకపోకల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రోడ్డుపై నెలకొల్పిన దుకాణాల సముదాయాలతో పాదాచార్లకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పలువురు వ్యాపారస్తులు నిబంధనలు పాటించట్లేదని, దీంతో సమస్యలు నెలకొంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరించగం గమనార్హం.

ఇతర రాష్ట్రాల నుండి సుమారు 30 దుకాణాలు మరిపెడ(బంగ్లా)లో వెలిశాయి. బతుకు తెరువు కోసం వచ్చామంటూ నిబంధనలు గాలికొదిలేస్తున్న పరిస్థితి. వరంగల్ -ఖమ్మం, మహబూబాబాద్ -సూర్యాపేట జాతీయ రహదారులకు ఇరువైపులా విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేశారని పట్టణవాసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై పలువురు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రధాన దుకాణాల ముందు ఉప దుకాణాలు నెలకొల్పడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఒక దుకాణం ముందు తోపుడు బండ్ల వ్యాపారస్తులు షాపు పెట్టుకుంటే నెలకు రూ.3000 కిరాయి చెల్లించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్ నుండి కార్గిల్ సెంటర్ వరకు మెయిన్ రోడ్డు పై ఇరువైపులా ఇదే పరిస్థితి నెలకొంది. త్రైబజార్ పేరుతో మున్సిపాలిటీకి అట్లాగే వ్యాపారస్తులకు పైకం చెల్లిస్తున్నట్టు తెలుపుతు న్నారు. మున్సిపాలిటీ అధికారులు స్థలం చూపెడితే అక్కడే వ్యాపారాలను కొనసాగిస్తామని పేర్కొంటున్నారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మరిపెడ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు రోడ్లపై తోపుడు బండ్లు గాని ఇతర వాహనాలు పెట్టకూడదని. మరిపెడ మున్సిపాలిటీ కమిషనర్ వెంకటస్వామి తెలిపారు. మెయిన్ రోడ్డు కు డివైడర్ నుండి 50 ఫీట్ల దూరాన్ని పాటించాలని సూచించారు. అంతకుమించి ఎవరైనా రోడ్లపై వ్యాపార సముదాయాలను ఇతర దుకాణదారుల వస్తువులను పెట్టినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. పట్టణ వ్యాపారస్తులు రోడ్డుపై ట్రాఫిక్ కు అంతరాయం కల్పించకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన పట్టణ ప్రజలకు సూచించారు.



-మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి

పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-బయ్యారం

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయ కత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూసపల్లి కుట్ర కేసును బనాయించిందని, ఇది బీజేపీ, బీఆర్ఎస్ పాలన కొనసాగింపుకు నిదర్శనమని, వెంటనే కేసు ఎత్తేయాలని ఆపార్టీ బయ్యారం మైదాన మండల కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్ రామగిరి బిక్షం అన్నారు. ఆదివారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ తదితరులను ఖమ్మం సమీపంలో ఫిబ్రవరి 14న అరెస్టుచేసి, 17 న రిమాండ్ చేసారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు పరిసరాలలోని పూసపల్లి వద్ద అరెస్టును చూపించిన రిమాండ్ రిపోర్టులో తప్పుడు పద్ధతులకు పోలీసులు పాల్పడి, ఈ కేసులో మొత్తం సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ అగ్ర నాయకత్వాన్ని ఇరికించారని అన్నారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తున్న సాదినేని వెంకటేశ్వరరావును, పార్టీ రాష్ట్ర నాయకులు, రైజింగ్ న్యూడెమోక్రసీ సహ సంపాదకులుగా పని చేస్తున్న కె. గోవర్ధన్, బయ్యారం మాజీ జెడ్పిటిసి, అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న గౌని ఐలయ్య, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సీతారామయ్య, తదితరుల పై రాజద్రోహం, అక్రమ ఆయుధాల చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసును మోపారని అన్నారు. పోలీసులు అల్లిన ఈ కట్టుకథలను ప్రజలు, ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో పివైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుడుం వీరభద్రం, పార్టీ నాయకులు మెంగు భగవాన్, గుండెబోయిన లింగమల్లు, ధారావత్ మంగీలాల్, కొదుమూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ తోనే గిరిజన తండాల అభివృద్ధి



నవతెలంగాణ -మరిపెడ

కాంగ్రెస్ పార్టీతోనే గిరిజన తండాలు అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మంగిలాల్,రమేష్, మహేశ్ గోపి, పిరయ్య అన్నారు. మరిపెడ మండలం వీరారం గ్రామ పంచాయతీ పరిధి భోత్తాల తండాలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను తండా నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామ చంద్రనాయక్ సహకారంతో గిరిజన తండాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరుచుకోనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గిరిజనులకు అమలు చేసిన రిజర్వేషన్ ద్వారానే ఈరోజు గిరిజనులు అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ర నవీన్, జెట్టి రాములు, విజయ్ నాయక్, భూక్యా మంగిలాల్ నాయక్, భావ్ సింగ్, అజ్మీరా రమేష్, వాంకుడోతు రవి,గోపి,పేరయ్య ఉప్పలి, నాయక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆకుల హరికృష్ణ

నవతెలంగాణ -మరిపెడ

బీజేపీ మరిపెడ మండల అధ్యక్షులుగా ఆకుల హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు వైవి రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల హరికృష్ణ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలకు, తదితరులు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో రాబోయే సర్పంచ్ ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ ముందుకు కొనసాగాలని, ఇందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులు వైవి రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, మోసంగి మురళి, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల మద్దతు ఎటువైపో ?

- పబ్లిక్ పల్స్...జోరుగా కాల్స్

నవతెలంగాణ-మల్హర్‌రావు

పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రజల పల్స్ తెలుసుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. వివిధ పద్ధతుల్లో ప్రయత్నాలు ప్రారంభించాయి. ఐవీఆర్ కాల్స్ ద్వారా ఓటర్ల మద్దతు తెలుసుకొనే పనిలో పడ్డాయి. పెద్దపల్లి పార్లమెంట్‌లో ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇప్పటికి ఎవరనేది అధిష్టానం అధి కారికంగా ప్రకటించలేదు. అభ్యర్థి ద్వారాలను ఆశి స్తున్న ఆశవాహుల్లో ఎవరికీ ఓటర్ల మద్దతు ఉంటుందనేది పార్టీల వ్యూహకర్తలు వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం.



పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఉన్న మంథని, పెద్దపల్లి, చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ పార్లమెంట్ టికెట్ ప్రస్తుత పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతకాని, పెద్దపల్లి మాజీ ఎంపీ సుగుణ కుమారి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీలు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఏనాడు పార్లమెంట్ వైపు కన్నెత్తి చూడక దేశం కానీ దేశంలో ఉంటూ 25 సంవత్సరాల తరువాత రాజకీయంలో అడుగు పెడుతున్న సుగుణ కుమారికా ? ఉద్యోగానికి రాజీనామా చేసి 2018లో చెన్నూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలమైన 2019లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్ నుంచి పెద్దపల్లి ఎంపీగా అనూహ్యంగా గెలిచి పెద్దపల్లి పార్లమెంట్‌ను కనీసం అభివృద్ధి చేయని బోర్లకుంట వెంకటేష్ నేతకాని కా.. ? స్వర్గీయ వెంకటస్వామి తాతగారి రాజకీయాల పునికి పుచ్చుకుని పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న గడ్డం వంశీకా ? అనేది సందిగ్ధంలో ఉంది.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మహదేవపూర్

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, మంత్రి గెలుపు కోసం, కార్యకర్తలకు అండగా ఉండి అంచెలంచెలుగా పార్టీలో వివిధ హోదాలో ఎదిగి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు ప్రోద్బలంతో తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి నియమితులైన విషయం విధితమే. ఆదివారం మహాదేవపూర్ మండల కేంద్రంలో శ్రీపాద చౌక్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షులు అయిత రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు, పాక్స్ చైర్మన్ సల్ల తిరుపతి రెడ్డి, ఎంపీపీ రాణిబాయి రామారావు, జెడ్పీటీసీ గుడాల అరుణ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పలిమెల అధ్యక్షులు చిన్నాన్న, రాంమోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వామన్ రావు, వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అయిత తిరుపతి రెడ్డి, పోటు మల్లారెడ్డి, సల్ల కేశవరెడ్డి,కోట సమ్మయ్య, ఓబీసీ మండల అధ్యక్షులు పోలు మొండయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, ఆర్ఎంపీల సంఘం నాయకులు దొడ్ల అశోక్, రమేష్ రెడ్డి, యూత్ నాయకులు కాదర్ల నాగరాజు, హరీష్, సురేందర్ రెడ్డి రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్ ములుగు - భూపాలపల్లి
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి : లింగమల్ల శంకర్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఏప్రిల్ 14న అంబేద్కర్ 133వ జయంతిని విజయవంతం చేయాలని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మహనీయుల ఆశయ సాధనలో కృషి చేస్తున్న వారిని గుర్తించి పూలే-అంబేద్కర్ సేవా రత్న అవార్డులు ఇస్తున్నట్టు తెలిపారు. మహనీయుల జీవిత చరిత్ర గ్రంథాలు ,పేద విద్యార్థులకు విద్య ఆర్థిక పరంగా ఆదుకోవడం, సామాజికంగా సేవలందించే వారిని సన్మానించి, అవార్డులు అంద జేయడమే సొసైటీ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఏవైయు కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, జోనల్ కోఆర్డినేటర్ పీక కిరణ్,ఏప్ యు అధికారప్రతినిది లిగామల్ల వెంకట స్వామి, జిల్లా కార్యదర్శి రాంచందర్, ఏవైయు జిల్లా ఉపాధ్యక్షుడు కేశారపు సురేందర్,కార్యదర్శి ఇందారపు రాకేష్, ఎస్సి, ఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా నాయకుడు వనపాకల రాజయ్య, సింగరేణి ఎస్సి,ఎస్టీ ఎంప్లాయిస్ నాయకుడు కర్లపల్లి కిష్టస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద క్షతగాత్రులను ఆదుకోవాలి : సీపీఐ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భూపాలపల్లి కాటారం జాతీయ రహదారిపై గత రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొని ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ కోరారు. ఆదివారం వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు మహిళలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. తీవ్రంగా గాయపడిన వారిలో బొల్లి సమ్మక్క, దుర్గం రాజేశ్వరి, మంతనే లావణ్య ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు, కలెక్టర్ భవేష్ మిశ్రా చొరవ చూపి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వారికి నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలై విషమంగా ఉన్న ముగ్గురు మహిళలను హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐయ నాయకులు వేముల శ్రీకాంత్, బొడ్డు మనోజ్,వాసం రజిత మౌనిక, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు
- జిల్లాను ముందు వరుసలో నిలపాలి
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి



10వ తరగతి విద్యార్థి దశకు కీలక మలుపు అని, విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను ముందువరుసలో ఉంచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యార్థులకు సూచించారు. నేటి నుండి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షాలు తెలిపి మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయాందోళనకు, ఒత్తిడికి గురికాకుండ పరీక్షలు రాయాలని సూచించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. 10వ తరగతి పరీక్షల నిర్వాణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయాని కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఇందుకు అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18వ తేదీ నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు ఉదయం.9:30 నుండి మధ్యాహ్నం12:30 వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాలలో 11 మండలాలకు చెందిన 3,547 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి గంట ముందు నుండే అనుమతిస్తారని అన్నారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, 20 మంది సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామని, 240 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారని తెలిపారు. ముగ్గురు సెంటర్ కస్టోడియన్లు, ఇద్దరు రూట్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాల్ ప్రాక్టీస్ జరిగినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షకు గైర్హాజరైన విద్యార్థుల వివరాలు అందజేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. తనిఖీకి వచ్చే అధికారులకు సైతం సెల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచాలని అన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా పకడ్బంధిగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు మానసికపరమైన ఒత్తిడిలను అధిగమించేందుకు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 98854 62305 కు కాల్ చేస్తే సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ప్రతి రోజు పరీక్షా పేపర్లను పోస్టల్ శాఖ ద్వారా రవాణా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పది పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు

ఎంఈఓ యాప సాంబయ్య

నవతెలంగాణ- తాడ్వాయి



నేటి నుండి జరిగే 10వ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ యాప సాంబయ్య తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని యజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 285 మంది 10వ తరగతి విద్యార్థులకు గాను, ఇందిరానగర్ జడ్‌పిహెచ్‌ఎస్, మేడారం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రోజు విడిచి రోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయ న్నారు. విద్యార్థులను ఎనిమిది గంటల 45 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారని, పరీక్ష సమయం పూర్తై న తర్వాతే బయటకు పంపుతామని ఆయన స్పష్టం చేశా రు. ఇందిరానగర్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో 117, మేడారం ఇంగ్లీష్ మీడియం పాఠశాల పరీక్షా కేంద్రంలో 168 పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 18 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణం లో జరగడానికి అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫర్నిచర్, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం మూ త్రశాలలు తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షలు జరిగే అన్ని రోజులు పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లు నెట్ సెంటర్లు మూసి వేయించాలని తెలిపారు. విద్యార్థులందరూ సమయపాలన పాటించి పరీక్ష హాలుకు చేరుకొని పరీక్షలు రాయాలని సూచించారు.

100 శాతం ఫలితాలు సాధించాలి : ఎంఈఓ



టేకుమట్ల : నేటి నుండి జరిగే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100శాతం ఫలితాలను సాధించాలని ఎంఈఓ కోడెపాక రఘుపతి అన్నారు. మండ లంలోని కేజీబీవీ పాఠశాల నుండి 45 మంది విద్యార్థులు, టేకుమట్ల జెడ్పీహెచ్ఎస్ నుండి 60 మంది, గర్మిళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ నుండి 13మంది, కుందనపల్లి జెడ్పీహెచ్ ఎస్ నుండి ఇద్దరు, వెలిశాల జడ్పీహెచ్ఎస్ నుండి 23 మంది, వెంకటరావుపల్లి జెడ్పిహెచ్ఎస్ నుండి ఐదుగురు మొత్తం 148 మంది విద్యార్థులు టేకుమట్ల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరు కాను న్నారని, ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థు లందరూ విధిగా పరీక్షలకు హాజరు కావాలని అన్నారు.

144 సెక్షన్ అమలు : ఎస్సై ప్రసాద్



టేకుమట్ల : నేటి నుండి జరిగే పదవ తరగతి పరీక్షల పరీక్ష కేంద్రం స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక ఎస్సై ప్రసాద్ అన్నారు. పరీక్షా సెంటర్ వద్ద గుంపులు గుంపులుగా జనం గుమి కూడొద్దని అన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లకు అనుమతి లేదని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మావోయిస్టులకు సహకరించొద్దు : సీఐ



నవతెలంగాణ-గోవిందరావుపేట

మావోయిస్టులకు గుత్తి కోయలు సహకరించొద్దని పస్రా పోలీస్‌స్టేషన్ సీఐ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మచ్చాపూరు గుత్తి కోయ గ్రామాన్ని కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించొద్దని అన్నారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని, ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్ఐ కమలాకర్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఐత ప్రకాష్ రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-మహాదేవపూర్

డీసీసీ అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆదివారం ఆయనను మహాదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ చల్ల తిరుపతి రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కట్కం అశోక్, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు పోలు మొండయ్య, మండల అధికార ప్రతినిధి బుర్రి శివరాజు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లేళ్ళ ముక్తేశ్వర్, ఎడపల్లి మాజీ ఉప సర్పంచ్ మోతె సాంబయ్య కలిసి సన్మానించారు.

మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మహదేవపూర్

డీసీసీ అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి రాణీబాయి రామారావు, జెడ్పీటీసీ గుడాల అరుణ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట రాజబాబు, పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం భూపాలపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. భూపాలపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడుకు చెందిన హేమకొండ సాంబయ్య పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో సాంబయ్య కుడికాలు నుజు నుజ్జు అయింది. ఎడమ కాలుకు సైతం గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. సాంబయ్య కుమారుడు భరత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు భూపాలపల్లి పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను సీఐ, ఎస్ఐ పరిశీలన

నవతెలంగాణ-గోవిందరావుపేట

రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం మండలంలోని ముత్తాపూర్ మచ్చాపూర్ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సీఐ శంకర్, ఎస్ఐ కమలాకర్ పరిశీలించారు. పోలింగ్ సెంటర్స్‌లో గతంలో జరిగిన ఎన్నికల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఓటు వేయడానికి పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు.

అవగాహన పెంచుకోవాలి

ప్రజలు సైబర్ నేరాలు, మోసాల పట్ల అవగాహన పెంచుకోవాలని సీఐ శంకర్, ఎస్ఐ కమలాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తాపూర్, తప్పమంచ గ్రామాలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు ఆన్లైన్ సైట్‌లలో ఇన్వెస్ట్మెంట్ చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చినట్లు, పార్ట్ టైం జాబ్స్ అంటూ, పార్సెల్ లో డ్రగ్స్ వచ్చాయంటూ మోసం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితులలో ఎవరికీ ఓటీపీలు, బ్యాంక్ సంబంధిత వివరాలు చెప్పకూడదని వివరించారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదంటే స్థానిక పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాహితి మృతి కారకుడిని శిక్షించాలి

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చంద జ్యోతి

నవతెలంగాణ-గోవిందరావుపేట

సాహితి మృతి కారకుడు, అధికార పార్టీకి చెందిన నాయకుడి కొడుకును కఠినంగా శిక్షించాలని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సంద్రగూడెం గ్రామంలో నిర్వహించిన మండల మహిళా సమావేశంలో ఆమె మాట్లాడారు. ములుగు జిల్లా వెంకటాపుర్ మండలం ఆలుబాకా గ్రామానికి చెందిన సాహితీ హైదరాబాద్ హాస్టల్‌లో ఫ్యానుకు ఉరి వేసుకొని చనిపోయిన విషయం తెలిసిందేనని అన్నారు. సాహితి మృతికి అధికార పార్టీ నేత కొడుకు వేధింపులే కారణమని తగు చర్యలు తీసుకుని సాహితీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసన కార్యక్ర మాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షురాలు అజ్మీర లలిత, అజ్మీర వీరమ్మ, స్వరూప, జ్యోతి, రమ్య, సమ్మక్క, విజయ, రేణుక, రాజా శృతి, షాకి బుజ్జి మార్క్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేలతో గాజులు బహూకరణ

నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ భవాని మాతకు గణపురం మండల కేంద్రానికి చెందిన హరిప్రియ కంగన్‌హాల్ నిర్వాహకులు సంగెపు మానస సతీష్ కుమార్ దంపతులు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.5 వేలతో ఏడాదికి సరిపడా గాజులను ఆలయానికి బహుకరించారు. వారికి ఆలయ అర్చకులు నరేష్, కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కతజ్ఞతలు తెలిపింది.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని మత్తడి సమీపంలో ఆదివారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బీరెల్లి రాజు, ఎంజపల్లి రవికి ఇద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వారికి 108 వాహనం టెక్నీషియన్ టి నగేష్ కుమార్ పైలట్ శ్రీనివాస్ ప్రథమ చికిత్స చేసి వరంగల్ తరలించినట్టు స్థానికులు తెలిపారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో నలుగురు రెవెన్యూశాఖ అధికారులు బదిలీపై పలిమెల మండలానికి వెళ్లినట్లు తహసీల్దార్ రవి కుమార్ ఆదివారం తెలిపారు. ఆర్ఐ జి సరిత పలిమెల మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా, నార మదుకర్ జూనియర్ అసిస్టెంటుగా మహాముత్తారం తహసీల్ధార్ కార్యాయానికి బదిలీ అయ్యారు. గట్టయ్య ఆఫీస్ సబార్డినేట్ మహాదేవ్ పూర్ మండలానికి బదిలీ అయ్యారు. ధరణి ఆపరేటర్ వెంకటేష్ మహాదేవపూర్ బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో మండల ఆర్ఐగా రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్‌గా కీర్తన, తహసీల్దార్ కార్యాలయ సబార్డినేట్‌గా మల్లేష్, ధరణి ఆపరేటర్‌గా సంతోష్ మండల తాసిల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మల్హర్‌రావు

భూపాలపల్లి డిసిసి అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డికి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపి,దుద్దిళ్ల చిత్రపటానికి భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి లకావత్ సవేందర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ బొమ్మ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొమ్మ మల్లారెడ్డి, వేల్పుల మహేందర్, గడ్డం ప్రేమ్ కుమార్, ఎడ్ల రామ్, మమత, ఐత స్వామి, కలిముద్దీన్, రాజు, రవీందర్, రమేష్ రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని రమనక్కపేట గ్రామంలో రూ.10లక్షలతో రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మైల జయరామ్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరీ (అనసూయ) సీతక చొరవతో మంజూరైన నిధులతో రోడ్ల పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి, సింగల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కొంకతి సంబశివారావ్, గ్రామ అధ్యక్షులు ఇందారపు లక్ష్మన్, బోనుగు లవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ ఇసుక జీరో దందా ?

- నవతెలంగాణ కథనంతో అధికారుల్లో కదలిక
- అర్ధరాత్రి కాటారం పోలీసుల దాడులు
- 6 ఇసుక లారీలు సీజ్.. కేసులు నమోదు ... 4 డంపింగ్ చేసి పరార్

నవతెలంగాణ-మల్హర్‌రావు





ప్రభుత్వం ఎంత కట్టడి చేసిన అక్రమ జీరో ఇసుక దందా మల్హర్,కాటారం మండలాల్లో యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ అక్రమ జీరో ఇసుక దందాపై నవ తెలంగాణ వరంగల్ ఎడిషన్ దినపత్రికలో ఇటీవల 'మానేరులో ఇసుక దొంగలు' అనే కథనానికి అధికారుల్లో ఆలస్యంగా కదలికలు వచ్చాయి. అక్రమ ఇసుక దందాపై కాటారం డిఎస్పీ రామ్మోహన్, సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని కొయ్యూర్ పోలిస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలు, కాటారం పోలిస్ స్టేషన్ పరిధిలో నాలుగు లారీలు, మొత్తం ఆరు అక్రమ జీరో ఇసుక రవాణా చేస్తున్న ఇసుక లారీలను సీజ్ చేసి, కాటారం,కొయ్యూర్ పోలిస్ స్టేషన్‌కు తరలించారు.లారీలపై విచారణ చేపట్టి, డ్రైవర్లు, ఓనర్‌పై కేసులు నమోదు చేశారు. కొందరు లారీల డ్రైవర్లు తాడిచెర్ల.. మల్లారం ప్రధాన రొడ్డుపై డంపింగ్ చేసిన నాలుగు లారీల పరార్ అయ్యాయి. ఈ కుప్పలను మండల తహశీల్దార్ కు అప్ప జెప్పినట్లు కొయ్యూర్ ఎస్ఐ నరేశ్ తెలిపారు.

చెక్ పోస్టు ముందు నుంచే ఇసుక దందా

విలాసాగర్, గంగారం గ్రామాల్లో అక్రమంగా ఇసుక డంపులు పోసి రాత్రి వేళల్లో గంగారం ఎక్స్ రొడ్డపై టీఎస్ఎండిసి చెక్ పోస్ట్, విలాసాగర్ లో ఉన్న సిసి కెమెరాలు తొలగించి అక్రమంగా జీరో ఇసుకను తరలిస్తూ ఇసుక వ్యాపారులు పైలెట్ ద్వారా ముందుగానే సమాచారం తెలుసుకొని లారీలను తరలిస్తున్న విషయం తెలిసిందే. ఇసుక రీచ్ ల లారీలతో కలిసి జీరో ఇసుక దందాను యధేచ్ఛగా సాగిస్తున్నట్టు తెలుస్తోంది.

వేబిల్లులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

కాటారం,మల్హర్ మండలాల్లో వేబిల్లులు లేకుండా జీరో ఇసుకను తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు.కేసులు నమోదు చేస్తూ, లారీలు సీజ్ చేస్తాం.

- కాటారం డిఎస్పీ రామ్మోహన్

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

- ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలి...
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా
- భూపాలపల్లి పట్టణంలో పర్యటన

నవతెలంగాణ-భూపాలపల్లి



వేసవిలో భూపాలపల్లి పట్టణ ప్రజలకు త్రాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని 19, 25వ వార్డులలో మునిసిపల్ అధికారులతో కలిసి ఆకస్మిక పర్యటన చేశారు. మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాపై క్షేత్రస్థాయిలో పర్యటించి నేరుగా ప్రజలను నీటి సరఫరా ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఉండే కుటుంబ సభ్యుల సంఖ్య, నీటి వినియోగం, ప్రతీ రోజు నల్లాల ద్వారా నీరు ఎంత సేపు వస్తుందనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలో 9 లక్షల లీటర్ల నిలువ నీరు సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నెలల్లో మూడు సార్లు మంచి నీటి ట్యాంకులను శుభ్రపరచాలని అన్నారు. శుభ్రపరచిన తేదీని ట్యాంక్ ఫిల్లర్ పై రాయడంతో పాటు రిజిస్టర్‌లో నమోదులు చేయాలని తెలిపారు. మంచి నీటి ట్యాంక్ పరిసరాలలో వ్యర్థాలు, చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి పట్టణంలో జోన్‌ల వారిగా జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేసిన 6 ట్యాంక్‌లను వారానికొక సారి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరిచి పట్టణ ప్రజలకు కలుషితం లేని స్వచ్ఛమైన, పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని అన్నారు. నీటి సమస్య ఎక్కువ ఉన్న వార్డులను గుర్తించి బోర్ మోటార్ల ద్వారా నీటి సరఫరా చేయాలని అన్నారు. పట్టణ ప్రజలకు నీటి సమస్య లేకుండా ఈ నాలుగు నెలలు మునిసిపల్ సిబ్బంది ప్రతి రోజు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నీటి సరఫరా చేస్తున్న క్రమంలో పైపులు ఎక్కడైన లీకైనా, పగిలి పోయిన వెంటనే గ్రిడ్ ఇంజనీర్‌కు సమాచారం అందించి తక్షణమే మరమ్మతులు చేపట్టే విదంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె వేంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, టీపీఓ సునీల్, ఏ ఈ మానస, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మేడారంలో మరో విషాదం..

- జంపన్న వాగు(గుండ్ల మడుగు)లో సందర్శకుడు మృతి

నవతెలంగాణ- తాడ్వాయి



మేడారం జంపన్న వాగులు మరోమారు అపశతి చోటుచేసుకుంది. జంపన్న వాగు కొత్తూరు ప్రాంతంలోని గుండ్లమడుగులో మునిగి మరో యువకుడు(సదర్శకుడు) మృతిచెందాడు. మృతుడు హైదరాబాద్‌కు చెందిన రాపాని రాజు(22) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాపాని రాజు కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి శనివారం సాయంత్రం మేడారం వనదేవతల దర్శనానికి వచ్చారు.జంపన్న వాగు వద్దకు చేరుకోగా జంపన్న వాగులో నీరు లేకపోవడంతో కొత్తూరు కాజ్వే సమీపంలోని గుండ్లమడుగు నీటిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పోయి నిటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాడ్వాయి ఏఎస్ఐ నారాయణ, కానిస్టేబుల్ నీల కంఠేశ్వరన్, వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. సాహసం చేసి కన్నెపల్లి గ్రామానికి చెందిన గొంది నర్సింగరావు సహకారంతో మృతదేహాన్ని వెలికి తీసారు. మృతుడి తండ్రి అనుమంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.